పొలాల్లోనే చేతికొచ్చిన పంట

- వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు
- ధాన్యం తరలించేందుకు నానా తంటాలు
- ముందస్తు చర్యలు చేపట్టాలంటూ రైతుల ఆవేదన


కొత్తపల్లి వెళ్లే దారిలో కొట్టుకుపోయిన రోడ్డు


కోత దశకు వచ్చిన వరి పంట


బ్యాతోల్ వెళ్లే దారిలో బ్రిడ్జి దుస్థితి

హవేళిఘణాపూర్(మెదక్): ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. దీంతో ఎన్నో ఆశలతో పంటలు సాగు చేసిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పంట చేతికందే సమయానికి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతుల నానా తంటాలు పడుతున్నారు. ఈ వర్షాలకు ఇసుక మేటలు పేరుకుపోవడంతో పాటు పొలాలు నీట మునిగాయి. ఇదిలా ఉండగా, మిగిలిన పొలంలో కోసిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తరలించలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా తూకం చేసిన వరిధాన్యం తరలించేందుకు లారీలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ధాన్యం తరించేందుకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారులు తాత్కాలికంగా రోడ్లు ఏర్పాటు చేసినా వాటిపై నుంచి వరిధాన్యం ట్రాక్టర్ లోడ్ వెళ్లేందుకు వీలు లేకుండా మారింది. ఒకవేళ ట్రాక్టర్ సహాయంతో ధాన్యం తరలించేందుకు ప్రయత్నించగా.. ట్రాక్టర్ బురదలో కూరుకుపోయి ప్రమాదం ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ముఖ్యంగా హవేళిఘణాపూర్ మండలంలోని కామారెడ్డి శివారులో ఉన్న కొత్తపల్లి, రాజపేట పరిసర ప్రాంత రైతులకు రోడ్ల ఇబ్బందులు వర్ణనాతీతం. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేసేలా చూడాలని కోరుతున్నారు.

దారి లేక ఇబ్బందులు



వరి కోతకు వచ్చింది. ధాన్యం తరలించేందుకు దారి సరిగ్గా లేదు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో కనీసం వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ధాన్యం తరలించడం ఇబ్బందికరంగా మారింది. వర్షాలతో కొంత వరి మునిగిపోగా మిగిలిన వరిని సమయానికి కోసినప్పటికీ ట్రాక్టర్లలో ధాన్యం తరలించలేని దుస్థితి ఉంది.

– కుర్మ సాయిలు, రైతు, వాడి

మరమ్మతు చేయించాలి



వర్షాలతో కల్వర్టుల వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ధాన్యం తరలించడం ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం గ్రామానికి లారీలు వచ్చి ధాన్యం తీసుకెళ్లే పరిస్థితి లేదు. తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేసినా వెళ్లడం సాధ్యం కాదు. అధికారులు స్పందించి లారీలు వచ్చి ధాన్యం తీసుకెళ్లే విధంగా రోడ్లను బాగు చేయాలి. – రాజయ్య, రైతు, వాడి

క్రీడల్లో సత్తా చాటిన 'గురుకుల' విద్యార్థులు


ట్రోఫీతో డిగ్రీ కళాశాల విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): యూత్ సర్వీసెస్ స్పోర్ట్స్ అండ్ అవేర్‌నెస్ ఆధ్వర్యంలో మైభారత్, యువ భారత్ ప్రతినిధులు నిర్వహించిన క్రీడా పోటీల్లో స్థానిక సాంఘీక సంక్షేమశాఖ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన బ్లాక్ లెవల్ పోటీల్లోనూ కళాశాల విద్యార్థినులు కబడ్డీలో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి, రెండో, మూడవ ర్యాంక్ సాధించి ట్రోఫీ గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి, మూడో ర్యాంక్ సాధించి బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు ఇతర అధ్యాపకులు ప్రశంసించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న విజన్ ఎన్జీఓ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో విజన్ ఎన్జీఓ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కరుణశీల, రాజు, విజన్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రాజులు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారులపై లైంగిక దాడులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి, న్యాయవాదులు, విజన్ ఎన్జీఓస్ కమ్యూనిటీ మొబైలైజర్ నవనీత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి

చేగుంట(తూప్రాన్): బాలికలు ఉన్నతంగా చదువుకొని గొప్పగా ఎదగాలని విజన్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రాజు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపల్లి కేజీబీవీ బాలికల హాస్టల్‌లో శనివారం అంతర్జాతీయ గర్ల్ చైల్డ్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ బాల్య వివాహంతో నష్టాలు, బాలికల శ్రమ దోపిడీ, బాలికలపై దాడులపై అవగాహన కల్పించారు. అదే విధంగా బాలికల విద్య హక్కులు, రక్షణ, విద్యావకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ శ్రీవాణి, సీఎస్ఎంఎస్ సంజీవ్, యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజల్లో రాజిరెడ్డి, నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని దామరంచ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అక్కంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఆలయంలో హనుమాన్, శివపంచాయతన సహిత విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అతిథులను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మంత్రికి ధన్యవాదాలు

నర్సాపూర్: గోదావరి జలాలు సరఫరా చేసేందుకు అవసరమైన పనులను అధికారులు చేపట్టినందున జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో గోదావరి జలాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి జలాలు సరఫరా చేసేందుకు శనివారం సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపట్టారన్నారు.

◆ ప్రభుత్వ భూమిలో కట్టడాలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తుండడంతో విలువైన భూమి అన్యాక్రాంతం అవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, మండల పరిధిలోని గోమారం నడిబొడ్డున ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 539తో పాటు పిత్తర్‌కుంటకు సంబంధించిన శిఖం భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నెల రోజుల క్రితం ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ, శిఖం భూమికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొంత మంది అక్రమార్కులు హద్దులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమిలో కట్టడాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధింత అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

◆ గుండెపోటుతో దుర్గేష్ మృతి


అంగని దుర్గేష్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: మత్స్య సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంగని దుర్గేష్ (54) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అంగని దుర్గేష్ కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం వాకింగ్ వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ఆయన మృతదేహాన్ని మెదక్‌కు తీసుకొచ్చారు. కాగా, 2016లో కొత్త జిల్లాలు అవిర్భావించిన తర్వాత ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన మత్స్యసహకార శాఖ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా దుర్గేష్ గెలుపొందాడు. ఆయన మృతిపై పలువురు ప్రజా ప్రతినిధులు, మత్స్యకారులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తూప్రాన్: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ తీగల కింద పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాసాయిపేటలో..

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మనోహర్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నర్సింహులు

హవేళిఘణాపూర్(మెదక్): ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్నశంకరంపేట మండలంలోని ఎస్.కొండాపూర్‌కి చెందిన మత్తడి నర్సింలు(44) శుక్రవారం మెదక్‌కు వస్తుండగా రామాయంపేట వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింలు గాయాలవ్వగా.. కుటుంబసభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


రేగోడ్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పోచయ్య సూచించారు. మండల కేంద్రంలో శనివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని, సెల్ ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నామన్నారు. ప్రతిదీ సెల్ ఫోన్‌తోనే లింక్ ఉండడంతో సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుని లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ర్యాగింగ్, సైబర్ క్రైం, మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి తదితర అంశాలపై యువత, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇటీవల మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని చెప్పారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏటీఎం, పిన్ నెంబర్, సీవీవీ, బ్యాంకు ఖాతా వంటి వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. అదే విధంగా మీకు లాటరీ తగిలిందని, కొంత డబ్బును సూచించి బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఎవరైనా ఫోన్ చేసినా నమ్మవద్దన్నారు. ఒకవేళ మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1930కి లేదా 100కు ఫోన్ చేసి పోలీసులు, ఇతర శాఖల యంత్రాంగం సేవలు పొందాలన్నారు.

తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దు

నర్సాపూర్: సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని ఎస్ఐ రంజిత్‌రెడ్డి సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే చెప్పవద్దన్నారు.

వ్యాపారి డబ్బు రాబట్టాం..

నర్సాపూర్‌కు చెందిన వ్యాపారి ఇమ్మడి విశ్వనాథ్‌రాం క్రెడిట్‌కార్డు నుంచి సైబర్ నేరస్తులు రూ.5.85లక్షలు కాజేశారని ఎస్ఐ రంజిత్‌రెడ్డి చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైం విభాగం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సీఐ జాన్‌రెడ్డితో పాటు విచారణ చేసి సైబర్ నేరస్తులు కాజేసిన సొమ్మును రాబట్టామని ఎస్ఐ వివరించారు.

యువకులకు అవగాహన..


యువకులకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఏఎస్ఐ వెంకటయ్య

హవేళిఘణాపూర్(మెదక్): యువకులు తమ వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని షీటీం ఏఎస్ఐ వెంకటయ్య అన్నారు. శుక్రవారం ముత్తాయికోటలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపడుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ విజయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు


తునికి కేవీకేలో ఎస్సీ రైతులకు వేపనూనె పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు, డీపీఓ దేవ్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో శనివారం కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ డాక్టర్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. డీపీఓ దేవ్ కుమార్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా మండలంలోని తునికి, రాయిలాపూర్‌ల్లో రూ 55వేలు విలువగల రెండు స్ప్రేయర్ పంప్‌సెట్లు, పోతిరెడ్డిపల్లి ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి రెండు లీటర్ల వేపనూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్ప్రేయర్ పంప్‌సెట్లను ఎస్సీ గ్రామ రైతులు ఉపయోగించుకోవడంతో పాటు మిగతా రైతులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏఓలు స్వప్న, హర్షిత, కేవీకే ఎస్సీ సబ్‌ప్లాన్ ఇన్‌చార్జి శాస్త్రవేత్త శ్రీనివాస్, రవికుమార్, ఉదయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


మాడ్వెట్‌పల్లిలో పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్): పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని మాడ్వెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంగన్ వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రుక్మిణి, సులోచన, ఆశావర్కర్ బీనమ్మ, ఏఎన్ఎం స్వరూప తదితరులున్నారు.

ఏకమయ్యారు.. శుభ్రం చేశారు


మురుగు కాల్వలను శుభ్రం చేసిన కాలనీవాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని హమ్మద్‌నగర్‌లో బీసీ కాలనీలో మురుగు కాల్వలంట చెత్త పేరుకుపోయిందని గ్రామ పంచాయతీ అధికారులకు కాలనీ వాసులు పలుమార్లు విన్నవించారు. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో కాలనీవాసులు ఏకమై.. సొంత ఖర్చులతో మురుగు కాల్వలను శుభ్రం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. బీసీ కాలనీలో కొన్నేళ్లుగా మురుగు కాల్వలు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఈ విషయమై పలుమార్లు కాలనీవాసులు గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు ఫిర్యాదు చేసిన స్పందించలేదు. దీంతో ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు తెలిపారు. అయినప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. దీంతో శనివారం కాలనీకి చెందిన రమేష్, విఠల, వెంకటేశ్, సాయవ్వ, దుర్గమ్మ, లక్ష్మి, మమత తదితరులు సొంత నిధులతో ట్రాక్టర్ ఏర్పాటు చేసుకుని శ్రమదానం చేశారు. అయితే పంచాయతీ అధికారులు, మండల అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని కాలనీవాసులు ప్రశ్నించారు. సంబంధిత అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా క్వార్టర్లు


నిరుపయోగంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ సంస్థ నిర్మించిన స్టాఫ్ క్వార్టర్లు

నర్సాపూర్: బీఎస్ఎన్ఎల్ నిర్మించిన క్వార్టర్లు సుమారు పదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. వివరాల ప్రకారం.. స్థానిక బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజీలో పని చేసే సిబ్బంది కోసం సుమారు 15 ఏళ్ల క్రితం సంస్థ రూ.70లక్షలు వ్యయం చేసి ఆరు క్వార్టర్లు నిర్మించింది. ఆ తర్వాత వీటిని సంబంధిత సిబ్బందికి కేటాయించగా.. సుమారు ఐదేళ్ల పాటు నివాసం ఉన్నారు. ఆ తర్వాత ఒకరిని చూసి మరొకరు అందరూ ఖాళీ చేసి వెళ్లిపోవడంతో క్వార్టర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అయితే రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన క్వార్టర్లను ఇతర అవసరాలకు వినియోగించి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. కొంతకాలంగా క్వార్టర్లు నిరుపయోగంగా ఉండడంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అలాగే క్వార్టర్లను ఆనుకుని ఎక్స్ఛేంజీ ఉండగా.. పలు పిచ్చి మొక్కలు ఎక్స్ఛేంజీ ఆవరణలోకి వచ్చాయి. పిచ్చి మొక్కలు తొలగించి క్వార్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పార్క్ చేసిన బైక్ దహనం


కాలిపోయిన బైక్

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దహనం చేసిన ఘటన మండలంలోని కుకునూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులు శుక్రవారం రాత్రి తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. అయితే అర్ధరాత్రి బైక్‌కు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించడంతో మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల వారు గమనించి నాగులుకు సమాచారం అందించారు. వెంటనే మంటలను అదుపులోకి తీసుకురాగా, అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై శనివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


నగదు అందిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని సాలోజిపల్లి గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు కొడపాక యాదగిరి తల్లి సాయమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిషమ్మ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సహాయంగా అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, నాయకులు సర్వని లక్ష్మణ్, వెంకట్ గౌడ్, నాయకులు సామేల్, చంద్రయ్య, వేముల యాదగిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం చేయడం తగదు


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పాపన్నపేట(మెదక్): నాగ్సాన్‌పల్లిలో ఇటీవల రెండు కుటుంబాల మధ్య జరిగిన దాడిలో ఓ వ్యక్తి మరణించాడు. అయితే ఈ విషయాన్ని కొంత మంది రాజకీయం చేసేందుకు ప్రయత్నించడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు సంతోష్‌చారి అన్నారు. శనివారం ఏడుపాయల్లో వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ఎంపీ రఘునందన్‌రావుపై మజ్లీస్ బచావో తహరీక్ స్పోక్స్ పర్సన్ అంజదుల్లాఖాన్ అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీనివాస్, బైండ్ల సత్యనారాయణ, రంజిత్ రెడ్డి ఉన్నారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు


ప్రీమియం లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లిలో శనివారం రెడ్డిపల్లి ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలను గణేష్‌చందన్ యూత్ సభ్యులు ప్రారంభించారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా.. ఈ నెల 13 వరకు జరగనున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500 నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు మాజీ సర్పంచ్ బాల్‌చందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, మల్లేశం, శ్రీకాంత్, కుమార్, యూత్ సభ్యులు ప్రవీణ్, రాజు, రంజిత్, ప్రశాంత్, విక్కి, రాజేశ్, గోపాల్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మురుగు కాల్వపై పైకప్పు నిర్మించండి


పైకప్పు వేయాలని కోరుతున్న కాలనీవాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మురుగు కాల్వపై పైకప్పు నిర్మించి సమస్య తీర్చాలని మండలంలోని కొత్తకాలనీ 9వ వార్డు సభ్యులు శనివారం కోరారు. కాలనీలో కొంతకాలంగా మురుగు కాల్వ పైకప్పు లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై అధికారులు, నాయకులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వ పైకప్పు నిర్మించడంతోపాటు కాలనీలో సీసీ రోడ్డు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎస్‌జీటీ పోస్టులను తగ్గించడం సరికాదు


గాలయ్య

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోధించే ఎస్‌జీటీ పోస్టులను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రాథమిక పాఠశాలల ప్రాధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్ల గాలయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కానీ మరింత బలహీన పర్చేందుకు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264